
# సాక్షి ఒడిశా

శనివారం । 19 । ఆగస్టు । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

| | |
|---|---|
| నగదు | రూ.4,77,456 |
| బంగారం | 570 మిల్లీ గ్రాములు |
| వెండి | 32 గ్రాముల 500 మిల్లీ గ్రాములు |

- భువనేశ్వర్/పూరీ



**ప్రజలు మార్పు కోరుకుంటున్నారు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

- IIలో



**50 కేజీల గంజాయి పట్టివేత**

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితి పోలీసులు 50 కేజీల గంజాయితో పాటు బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

- IIలో

## న్యూస్‌రీల్

### రక్తదానంతో ప్రాణదానం

● ఎంపీ చంద్రశేఖర్ సాహు



రక్తదానం చేస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

**బరంపురం:** రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయవచ్చని ఎంపీ చంద్రశేఖర్ సాహు అన్నారు. స్థానిక ఎంకేసీజీ మెడికల్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో రక్తం లభించక అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సెప్టెంబర్‌లో గంజాంకు రాహుల్ గాంధీ



స్టేడియంను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**బరంపురం:** సెప్టెంబర్ నెలలో జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ గంజాం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో హెలీకాప్టర్ దిగేందుకు గంజాం జిల్లా కుకుడాఖండి బ్లాక్‌లోని మినీ స్టేడియంను ఆ పార్టీ నాయకుడు బిజయ్ కుమార్ పట్నాయక్‌తో పాటు గంజాం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, సన్నోఖుముండి కాంగ్రెస్ ఎమ్మెల్యే రమేష్ చంద్ర జెన్నాలు శుక్రవారం పరిశీలించారు. వారితో పాటు కుకుడాఖండి బ్లాక్ అధ్యక్షుడు శిబరామ్ ప్రసాద్ దొర, కార్యదర్శి శాఖ సూజి తదితరులు ఉన్నారు.

### విదేశీ మద్యం స్వాధీనం



విదేశీ మద్యంతో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

**రాయగడ:** జిల్లాలోని కాసీపూర్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 32.205 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి కాసీపూర్‌కు చెందిన ఉమాశంకర్ గౌడోగా పోలీసులు గుర్తించారు. విదేశీ మద్యంను అక్రమంగా తరలిస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. ఇదిలా ఉండగా గడిచిన 24 గంటలంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వాహన, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఒక కేసు నమోదు చేసి, రూ.95 వేల అపరాధ రుసుము వసూళ్లు చేసినట్లు ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు. అలాగే మరో ఎనిమిది ఎక్సైజ్ కేసులు నమోదు చేసి, 76.82 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

### ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతి



ప్రమాద స్థలంలో వృద్ధుడి మృతదేహం

**మల్కన్‌గిరి:** జిల్లా కేంద్రంలోని సావిత్రీ క్వారీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం మధ్యాహ్నం రోడ్డుపై వృద్ధుడు వెళ్తుండగా అటువైపుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఐఐసీ రీగాన్ కీండో ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించగా మృతి చెందిన వ్యక్తి మల్కన్‌గిరి పట్టణంలోని సత్తిగూడ గ్రామానికి చెందిన గోపీ పంగి(70)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# అదరహో..!



జాతీయ జెండాతో ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

స్థానిక టౌన్ హాల్‌లో గంజా జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో వందేమాతరం నృత్య ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన భాష, సంస్కృతి, కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్ పండా, వందేమాతరం కమిటీ అధ్యక్షుడు నారాయణ మాంకుడో, కార్యదర్శి గోపాల్ పట్నాయక్, సుదీప్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు. – బరంపురం



ఆకట్టుకుంటున్న చిన్నారుల వందేమాతరం దేశభక్తి గేయం నృత్య ప్రదర్శన



వేదికపై ప్రసంగిస్తున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు



చిన్నారుల సంబల్‌పూరి నృత్య ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న నగర ప్రజలు

# ఒడిశాకు ఏపీఎస్ ఆర్టీసీ సేవలు

● నేటి నుంచి రాకపోకలు సాగించనున్న 7 బస్సులు

**కొరాపుట్:** ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ) కొత్తగా 7 బస్సులను ఒడిశా వైపు నడపనుంది. ఇవి శనివారం నుంచి రోడ్డెక్కనున్నాయి. విశాఖపట్నం నుంచి బయల్దేరి అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో ప్రయాణించనున్నాయి. విశాఖపట్నం నుంచి సాయంత్రం 5 గంటలకు బయల్దేరి సాలురు మీదుగా నబరంగ్‌పూర్‌కు ఒక బస్సు నడవనుంది. అదే బస్సు ఉదయం 5 గంటలకు నబరంగ్‌పూర్ నుంచి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. మరో బస్సు ఉదయం 10 గంటలకు బయల్దేరి సాలూరు మీదుగా జయపూర్ రానున్నది. అదే బస్సు రాత్రి 8 గంటలకు విశాఖపట్నం వెళ్లనుంది. ఒక బస్సు విశాఖపట్నం నుంచి సాయంత్రం 3.30 గంటలకు బయల్దేరి ఎస్.కోట, అరుకు మీదుగా ఒనక ఢిల్లి వెళ్లనుంది. అదే బస్సు ఉదయం 5 గంటలకు ఒనక ఢిల్లి నుంచి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. విశాఖపట్నం నుంచి ఒక బస్సు ఉదయం 10 గంటలకు బయల్దేరి శ్రీకాకుళం, పాతపట్నం మీదుగా పర్లాకిమిడి వెళ్లనుంది. అదే బస్సు సాయంత్రం 3.15 గంటలకు బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. విశాఖపట్నంలోని కూర్మనపాలేం నుంచి ఉదయం 6 గంటలకు బస్సు బయల్దేరి శ్రీకాకుళం, పర్లాకిమిడి మీదుగా గుణుపూర్ వెళ్లనుంది. అదే బస్సు మధ్యాహ్నం 1 గంటలకు గుణుపూర్ నుంచి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది. సింహాచలం నుంచి మధ్యాహ్నం 1.30కు బయల్దేరి విశాఖపట్నం రాజాం, పాలకొండ, కొత్తూరు, హడ్డుబంగి మీదుగా ఒక బస్సు గుణుపూర్ వెళ్లనుంది. అదే బస్సు వేకువ జామున 4 గంటలకు గుణుపూర్ నుంచి బయల్దేరి తిరిగి సింహాచలం వెళ్లనుంది. విశాఖపట్నం నుంచి సాయంత్రం 4 గంటలకు బయల్దేరి విజయనగరం, పార్వతీపురం, గుమ్మ లక్ష్మీపురం మీదుగా గుణుపూర్ బస్సు వెళ్లనుంది. అదే బస్సు గుణుపూర్‌లో ఉదయం 6.30కి బయల్దేరి విశాఖపట్నం వెళ్లనుంది.




ఒనక ఢిల్లీలో బస్సు ఎక్కుతున్న గిరిజనులు

**పార్వతీపురం–నబరంగ్‌పూర్‌కు బస్సు వేయరూ..?**

పార్వతీపురం నుంచి నబరంగ్‌పూర్‌కు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు వేయాలని చాలాకాలంగా స్థానికులు కోరుతున్నారు. పార్వతీపుం, బందుగాం, నారాయణపట్న, కొరాపుట్, జయపూర్ మీదుగా బస్సు నడపాలని తెలుగు ప్రజలు చేస్తున్న డిమాండ్ పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. ఈ రెండు పట్టణాల మధ్య వందలాది కుటుంబాలు ప్రతిరోజూ ప్రయాణాలు చేస్తుంటాయి. ఓఎస్ ఆర్టీసీ మాత్రం ఈ మార్గంలో జయపూర్–పార్వతీపురం మధ్య బస్సు నడుపుతోంది. దీంతో ఈ బస్సు కనీసం నబరంగ్‌పూర్‌కు పొడిగించాలని స్థానిక ఎమ్మెల్యే సదాశివ ప్రదానికి తెలుగు ప్రజలు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే స్వయంగా ఇదే సమస్య మీద భువనేశ్వర్ వెళ్లి ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతి అందజేశారు. దీంతో ఈ బస్సు జయపూర్ నుంచి నబరంగ్‌పూర్ పొడించడంపై అవకాశాల నివేదిక సమర్పించమని రాష్ట్ర ప్రభుత్వం నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రాకి ఆదేశించింది. కలెక్టర్ సానుకూల నివేదిక పంపించారు. అయినప్పటికీ బస్సు పొడిగింపులో సాంకేతిక సమస్యలు అడ్డురావడంతో ఆలస్యమవుతోంది. ఈ మార్గంలో ఈ బస్సుపై వందలాది తెలుగు ప్రజలు ఆధారపడి ఉన్నారు. కనీసం ఏపీఎస్ ఆర్టీసీ వారు పార్వతీపురం డిపో నుంచి నబరంగ్‌పూర్‌కు బస్సు వేయాలని తెలుగు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సజావుగా జిల్లా పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు

**పర్లాకిమిడి:** జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా పరిషత్ సమావేశం శుక్రవారం సజావుగా జరిగింది. జెడ్పీ చైర్మన్ గవర తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ గుణనిధి నాయక్, ఎంపీ ప్రతినిధిగా ప్రదీప్ నాయక్, ఎమ్మెల్యే ప్రతినిధిగా ఆదర్శ దాస్, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని గజపతి, కృష్ణసాగార్ కుడి, ఎడమ కాలువల మరమ్మతులు సకాలంలో చేపట్టక పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కనీసం జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టడం లేదని విమర్శించారు. దీనిపై స్పందించిన సూక్ష్మ నీటి పారుదల శాఖ ఎస్‌ఈ జగన్నాథ్.. పనులు జరిగాయని వివరణ ఇచ్చారు. అలాగే జిల్లాలోని ప్రాథమిక విద్య, రోడ్లు, తాగునీరు, గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణంపై జెడ్పీ చైర్మన్ అధికారుల నుంచి వివరాల కోరారు. సమావేశంలో కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, గుమ్మ సమితి అధ్యక్షురాలు సునేమి మండల్, వివిధ సమితుల సర్పంచ్‌లు, సమితి సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కీలకమైన జెడ్పీ సమావేశానికి తొలుత విలేకర్లను అనుమతించి, అనంతరం నిరాకరించడంపై జిల్లా ప్రెస్‌క్లబ్ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు.



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు

# అర్చకుని కుటుంబానికి రాజ్‌భవన్‌కు ఆహ్వానం



పార్లమెంట్ భవనం ముందు నాగరాజు



నాగరాజు కుటుంబ సభ్యులు

**కొరాపుట్:** జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ దేవాలయం అర్చక కుటుంబాన్ని ఒడిశా రాజ్‌భవన్ ఆహ్వానించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ప్రధానార్చకులు కె.బాలకృష్ణ కుమారుడు కె.నాగరాజు 2021లో ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) ఉత్తీర్ణత పొందారు. ఆ ఏడాది రాష్ట్రం నుంచి ఇద్దరు మాత్రమే ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. ఇందులో తల్లిదండ్రుల కృషి ఎనలేనిదని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఇదే తరహాలో ప్రతి రాష్ట్రంలో సివిల్స్‌కు ఎంపికైన వారి కుటుంబాలను ఆయా రాష్ట్రాల రాజ్‌భవన్‌కు పిలిపించి, సన్మానించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కొరాపుట్‌లోని నాగరాజు తల్లిదండ్రులు బాలకృష్ణ, రుక్మిణీదేవి దంపతులకు ఆహ్వానం అందింది. సాధారణ మధ్య తరగతి తెలుగు కుటుంబానికి ఈ అరుదైన అవకాశం రావడంపై పట్టణ వాసులు అభినందనలు తెలియజేశారు. ఈనెల 21న రాజ్‌భవన్‌లో వీరిని సన్మానించనున్నారు.

# రుణాల పేరిట దోపిడీ

● ప్రైవేటు సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న బసంతకుమార్, టుటు దాస్

**రాయగడ:** ప్రభుత్వం తరుపున ఎటువంటి అనుమతులు లేకుండా చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తూ, అనంతరం వారి నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేడీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్రశాఖ కార్యవర్గ సభ్యుడు బసంతకుమార్ ఉలక, జిల్లా కార్యదర్శి పద్మనాభ దాస్(టుటు) పట్టణంలోని అశోక్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన కొన్ని సంస్థలు చిరు వ్యాపారులకు ముందుగా రుణాలు అందించి, అనంతరం వారి నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గత 3 దశాబ్దాలుగా ఈ దందా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. చిరు వ్యాపారులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి విసుగెత్తి పోతున్నారని, దీంతో గత్యంతరం లేక ప్రైవేటు సంస్థల వద్ద బలవతున్నారని విమర్శించారు. ప్రభుత్వమే సహకారం అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే వడ్డీ వ్యాపారాలు చేసే సంస్థలు తప్పనిసరిగా అనుమతులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని స్పష్టంచేశారు.

### ఒడియా విశ్వవిద్యాలయం వీసీగా సబితా



ప్రొఫెసర్ సబితా ప్రధాన్

**భువనేశ్వర్:** పూరీ జిల్లా సత్యవాది ఒడియా విశ్వవిద్యాలయం తొలి వైస్ ఛాన్సలర్ (వీసీ)గా ప్రొఫెసర్ సబితా ప్రధాన్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వ విద్యాలయాల ఛాన్సలర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ శుక్రవారం నియమించారు. ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించిన నుంచి 2 సంవత్సరాలు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ హోదాలో నిరవధికంగా కొనసాగుతారు. ఆమె ప్రస్తుతం విశ్వభారతి, శాంతినికేతన్‌లో ఒడియా డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆధునిక ఒడియా సంస్కృతి, మాండలికం రంగాల్లో ఆమె నైపుణ్యత సాధించారు.

### ఆస్పత్రిలో మంటలు

**భువనేశ్వర్:** బరిపద పండిట్ రఘునాథ్ ముర్ము వైద్యబోధన ఆస్పత్రిలో మంటలు చెలరేగాయి. ఈ సముదాయం మూడో అంతస్తులో ఉన్న ఐసీయూ, గైనకాలజీ విభాగంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. వార్డులో చికిత్స పొందుతున్న రోగులందరినీ తక్షణమే సురక్షితంగా బయటకు తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.



ఐసీయూ వార్డులో మంటలు అదుపు చేస్తున్న దృశ్యం

### హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు

**భువనేశ్వర్:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కోసం సుప్రీంకోర్టు కొలీజియం ఇద్దరిని సిఫారసు చేసింది. వీరిలో ఒకరు న్యాయవాది కాగా, వేరొకరు న్యాయాధికారి కావడం విశేషం. వీరిలో హైకోర్టులో న్యాయవాదిగా చేస్తున్న శిబొ శంకర్ మిశ్రా, జ్యుడీషియల్ అధికారి ఆనంద చంద్ర బెహరా ఉన్నారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఈ వివరాలు వెల్లడించారు. న్యాయవాద రంగంలో శిబొ శంకర్ మిశ్రాకు సుదీర్ఘంగా 3 దశాబ్దాల అనుభవం ఉంది. స్థానిక బార్‌లో 30 సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. సుప్రీంకోర్టులో ఆన్ రికార్డ్ న్యాయవాదిగా రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. సివిల్, క్రిమినల్ మరియు సర్వీస్ చట్టంలో నిపుణులు. అతను సుప్రీంకోర్టులో ఒడిశా తరపున అడ్వకేట్ ఆన్ రికార్డ్, కేంద్ర ప్రభుత్వం మరియు ఒరిస్సా హైకోర్టుకు న్యాయవాదిగా వ్యవహరించారు. రాష్ట్ర హై కోర్టుకు న్యాయమూర్తిగా సిఫారసు అయిన మరొకరిలో ఆనంద చంద్ర బెహరా రాష్ట్రంలో వివిధ హోదాల్లో న్యాయాధికారిగా పనిచేశారు.

# ఎమ్మెల్యే మహ్మద్ మొకీంకు ఊరట

● శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలని దాఖలైన పిల్ విచారణ

● కొట్టివేసిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం



మహ్మద్ మొకీం

**భువనేశ్వర్:** బారాబతి – కటక్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ మొకీంకు ఊరట లభించింది. పార్టీ క్రమశిక్షణ చర్యగా అఖిల భారత కాంగ్రెసు కమిటీ(ఏఐసీసీ) ఆయనపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఆయన శాసన సభ్యత్వం రద్దు చేయాలని ఒడిశా హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై విచారించిన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభాశిష్ తలపత్ర మరియు జస్టిస్ సావిత్రి రొథొతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీలో మహ్మద్ మొకీం సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) కొట్టివేసింది.

**ప్రత్యేక ధర్మాసనాన్ని ఆశ్రయించాలని సూచన**

గ్రామీణ గృహ రుణాల కుంభకోణంలో ఎమ్మెల్యే మొకీంను నిందితునిగా పరిగణించి శాసన సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించాలనే అభ్యర్థనతో ఆర్.ఆర్.సాహు అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ పురస్కరించుకుని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించిన విషయాలను విచారించడానికి ప్రత్యేక డివిజన్ బెంచ్ ఉందని హైకోర్టు పేర్కొంది. సిటింగ్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీంకు వ్యతిరేకంగా దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఆశ్రయించాలని పిటిషన్ కొట్టివేసింది. దీంతో రుణ కుంభకోణంలో మొకింను దోషిగా నిర్ధారించిన క్రిమినల్ అప్పీల్‌ను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయస్థానం చొరవ కల్పించుకోవాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ కేసు పూర్వాపరాల విచారణ పురస్కరించుకుని 2022 అక్టోబర్ 19న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులతో 9 నెలలుగా ఈ కేసు విచారణ నిలిచిపోయినట్లు వివరించారు. ఎమ్మెల్యేలు, ఎంపీల నేరారోపణలతో దాఖలయ్యే క్రిమినల్ అప్పీళ్లను ఆరు నెలల వ్యవధిలో పరిష్కరించే మార్గదర్శకంతో సత్వర విచారణకు ఆదేశాలు జారీ చేయాలని ప్రత్యేకంగా అభ్యర్థించారు.

**ఇదీ విషయం**

ఒడిశా గ్రామీణ గృహ నిర్మాణ అభివృద్ధి కార్పొరేషన్ (ఓఆర్‌హెచ్‌డీసీ) రుణాల కుంభకోణంలో గతేడాది సెప్టెంబర్ 29న భువనేశ్వర్ ప్రత్యేక విజిలెన్స్ కోర్టు విచారణ ముగించింది. తదనంతరం జారీ చేసిన ఉత్తర్వుల్లో మాజీ ఐఏఎస్ అధికారి, ఓఆర్‌హెచ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ కుమార్‌తో పాటు మరో ఇద్దరిని దోషులుగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో బరాబటి – కటక్ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీంకు ప్రత్యేక విజిలెన్సు కోర్టు మూడేళ్ల కారాగార శిక్ష విధించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందిత ఎమ్మెల్యే క్రిమినల్ అప్పీల్‌ను దాఖలు చేశారు. 2022 సంవత్సరం అక్టోబర్ 1న ట్రయల్ కోర్టు లోపభూయిష్టమైన ఆదేశాలు జారీ చేయడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా

### కలప పట్టివేత.. ఒకరు అరెస్టు



పట్టుబడిన కలపను చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి ఎంవీ 24 గ్రామంలో మిథన్ కవిరాజ్ అనే వ్యక్తి ఇంట్లో కలప ఉన్నట్లు అటవీ శాఖ సిబ్బందికి మందస్తు సమాచారం వచ్చింది. దీంతో గురువారం రాత్రి కవిరాజ్ ఇంటిపై దాడిచేసి మొత్తం 40 కలప ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆయనను శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన కలప విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా కలప రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### భక్తిశ్రద్ధలతో పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవలు, అభిషేక పూజలు జరిగాయి అనంతరం సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో యువకునికి గాయాలు



విద్యుత్‌షాక్‌తో గాయపడిన మర్ల అజయ్

మందస: మండలంలోని పొత్తంగి గ్రామానికి చెందిన మర్ల అజయ్ అనే యువకునికి శుక్రవారం విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. కింద పడి ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు అజయ్‌కు తగలడంతో స్థానికులు రక్షించారు. 108 వాహనంలో హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకై పలాసలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల క్రితమే విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ దల్లి జానకిరావు రెడ్డి చెప్పారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.

### పాము కాటుతో మహిళా పోలీసు మృతి



మహిళా సంరక్షణ కార్యదర్శి తామాడ జ్యోతికుమారి

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిపేట సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్)గా పనిచేస్తున్న తామాడ జ్యోతికుమారి (36) పాముకాటుతో మృతిచెందారు. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామానికి చెందిన తామాడ జ్యోతికుమారి తన తండ్రి రిటైర్డ్ వీఆర్ఓ తామాడ రామారావు ఇంటిలో ఉంటున్నారు. శుక్రవారం బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఆటోపై కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా జ్యోతికుమారి మార్గం మధ్యలోనే మృతి చెందారు. ఆమెకు భర్త జయరాజ్, కుమారుడు రఘునాథ్ ఉన్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె మృతిపై తర్లిపేట సచివాలయ సిబ్బంది వి.రమేష్, డి.అప్పన్న, ఎం.మాధురి, టి.రాము, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### కొత్తమ్మతల్లి బంగారం డిపాజిట్



బ్యాంకులో బంగారం డిపాజిట్ చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయానికి కానుకల ద్వారా వచ్చిన 750 గ్రాముల బంగారాన్ని విశాఖపట్నం స్టేట్‌బ్యాంకు శాఖలో గోల్డుబాండు స్కీము కింద శుక్రవారం డిపాజిట్ చేసినట్లు ఆలయ ఈఓ వాచకవర్ల రాధాకృష్ణ తెలిపారు.

### నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కోఆర్డినేటర్‌గా గోవిందరావు

లావేరు: ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో ఆర్డినేటర్‌గా మండలంలోని బుడుమూరు హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం తెలిపారు. ఈయనతో పాటు మరో పది మంది ఉపాధ్యాయులను క్లస్టర్ కోఆర్డినేటర్లుగా నియమించినట్లు తెలిపారు.

# ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- కాంగ్రెస్ నాయకుల మండిపాటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆందోళనలు

పర్లాకిమిడి:

రాష్ట్రం, కేంద్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మోహనా నియోజకవర్గం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు దాశరథి గొమాంగో అన్నారు. గజపతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్ని సమితి కేంద్రాల్లో మణిపూర్ ఘటనపై శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. తొలుత మోహనా బస్టాండ్ నుంచి సమితి కేంద్రం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకుండా, నిరుద్యోగ సమస్యను పెంచుతోందని దుమ్మెత్తిపోశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

**గుసాని సమితిలో...**

గుసాని సమితి కార్యాలయం ఎదుట కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు, విశ్రాంత ముఖ్య చీఫ్ సెక్రటరీ బిజయ పట్నాయక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీజేడీలు ఒకేవిధంగా ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల ముందు బీజేడీ ప్రభుత్వం ప్రజలను ప్రలోభాలకు గురిచేసి ఓట్లు దండుకుంటోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం గుసాని బీడీవోకు రాష్ట్రపతికి రాసిన వినతిని అందజేశారు. ఆందోళనలో కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్యనారాయణ పాత్రో, ఉపాధ్యక్షుడు బసంత పండా, అభిమన్యు పండా, మాజీ వైస్ చైర్మన్ సంజయ్ అధికారి, త్రినాథ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సమితి కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి ర్యాలీగా సమితి కార్యాలయానికి చేరుకున్న శరత్ పట్నాయక్‌తో పాటు తదితరులు సమితి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

రాయగడ: జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమితి కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. పీసీసీ రాష్ట్ర శాఖ మహిళ విభాగం సాధారణ కార్యదర్శి రత్నమణి ఉలక, పార్టీ సీనియర్ నాయకుడు అప్పల స్వామి కద్రక, సింహాచల్ ఉలక, డీసీసీ ఉపాధ్యక్షుడు శంకర్షన్ మంగరాజ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నమణి ఉలక మాట్లాడుతూ సమితుల్లో పీసీల వ్యవహారం అడ్డూ అదుపు లేకుండా పోతోందన్నారు. దీంతో అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించడంతో పాటు మంజూరవుతున్న నిధులు సక్రమంగా వినియోగమవ్వడం లేదని ఆరోపించారు. అనంతరం వివిధ సమస్యలపై బీడీవో లక్ష్మీ నారాయణ సాబొతొకు వినతిపత్రం సమర్పించారు.



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు



రాయగడ: బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పర్లాకిమిడి: గుసాని సమతి కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షుడు బిజయ పట్నాయక్



పర్లాకిమిడి: మోహనా బీడీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే దాశరథి గొమాంగో



పర్లాకిమిడి: మోహనా బ్లాక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దాశరథి గొమాంగో తదితరులు



మల్కన్‌గిరి: సమితి కార్యాలయానికి వచ్చిన పార్టీ నేతలు



పర్లాకిమిడి: గుసాని సమితి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# 50 కేజీల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోలీసులు 50 కేజీల గంజాయితో పాటు బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మల్కన్‌గిరి ఏఎస్పీ రాహుల్ గోయల్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 15వ తేదీన కలిమెల పోలీసులు కలిమెల సమితి పుల్లిమెట్ల గ్రామంలో కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఒక కారు అతివేగంగా రావడం గమనించి ఆపి తనిఖీ చేశారు. కారులో గంజాయిని గుర్తించి ముగ్గురిని అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా మల్కన్‌గిరి బస్టాండ్‌లో మరో ఇద్దరు ఉన్నట్లు తెలియజేశారు. దీంతో అక్కడికి వెళ్లి వారిని అరెస్టు చేశారు. అదేవిధంగా బుధవారం మరో కారులో రెండు బ్రౌన్ షుగర్ ప్యాకెట్లు తీసుకెళ్తున్న మహారాష్ట్రలోని ఛకాన్ గ్రామానికి చెందిన గైకావార్డ్, యువరాజ్ శ్యామ్, కర్ణాటకకు చెందిన సతీష్ దిలీప్ వర్మ, రాహుల్ కేశవ, మల్కన్‌గిరి జిల్లా కలిమెల ఎంవీ 66 గ్రామానికి చెందిన శంకర్ వైష్ణవ్‌ను అరెస్టు చేశారు. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని వెల్లడించారు. అలాగే రెండు కార్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్రౌన్ షుగర్ ప్యాకెట్లు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాహుల్ గోయల్

# సైకిల్ దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు

జయపురం: ఒక సైకిల్ దొంగతనం కేసులో ఇద్దరు నిందితులతో పాటు వారి వద్ద నుంచి సైకిల్ కొనుగోలు చేసిన వ్యక్తిని జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 14వ తేదీ రాత్రి ఆదర్శనగర్‌కు చెందిన రజిత్ యాదవ్ తన ఇంటి ముందు సైకిల్ ఉంచగా, అది దొంగతనానికి గురయ్యింది. దీంతో 15వ తేదీన పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమేరాలు అధారంగా దొంగలను గుర్తించారు. దొంగిలించిన వారిలో బిద్యాధరపూర్ దండాసి సాహికి చెందిన కాలు పారజ, బలిపటా వీధికి చెందిన ఇతిన్ పట్నాయక్‌ల ఉన్నట్లు పోలీసు అధికారి సత్యానంద పాత్రో వెల్లడించారు. వీరు సైకిల్‌ను మిల్లు వీధి కవాడి దుకాణంలో రూ.300లకు అమ్మి వేశారని పేర్కొన్నారు. ముగ్గురుని అరెస్టు చేసినట్లు తెలిపారు.



అరెస్టు చేసినవారిని చూపిస్తున్న పోలీసులు

# ఏడి 'పింఛెన్'!

- పింఛన్ కోసం ట్రాలీ రిక్షాలో వచ్చిన 95 ఏళ్ల వృద్ధురాలు

పర్లాకిమిడి: దేశానికి స్వాతంత్య్రం వచ్చే నాటికి ఆమె వయస్సు 19ఏళ్లు. దేశంలోని పేద, బలహీన వర్గాలను ఆదుకునేందుకు జాతీయ సామాజిక పింఛన్ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టే నాటికే ఆమెకు 67ఏళ్లు నిండాయి. మరో ఐదేళ్లలో శతాధిక వృద్ధురాలి జాబితాలో సైతం చోటు దక్కించుకోనుంది. అయినా.. నేటికీ సామాజిక భద్రతకు నోచుకోలేదు. తిండి గింజలు లేక అల్లాడుతున్న పరిస్థితుల్లో పింఛన్ కూడా లేకపోవడంతో తన దీనావస్థను విన్నవించేందుకు అధికారుల వద్దకే వెళ్లాలనుకుంది. ఈ నేపథ్యంలో కాలు కదపలేని పరిస్థితుల్లో ట్రాలీ రిక్షాలో పడుకొని, పురపాలక కార్యాలయానికి చేరుకోవడం అందరినీ కలచి వేసింది. పర్లాకిమిడిలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన చుట్టుపక్కల వారికి కన్నీళ్లు తెప్పించాయి. పర్లాకిమిడిలోని 12వ వార్డుకు చెందిన లవంగ గయా(95)కు వివిధ కారణాలు చూపుతూ గత కొంతకాలంగా మధుబాబు పింఛన్ పథకం ద్వారా అందిస్తున్న రూ.500 లను నిలిపివేశారు. మున్సిపల్ ఈఓ వనమాలి శత్పతిని కలిసి, తన పరిస్థితి వివరించేందుకు ఆటోకు డబ్బులు లేకపోవడంతో పాటు నడవలేని స్థితిలో రిక్షాలో వెళ్లాల్సి వచ్చింది. ప్రభుత్వ తీరును పలువురు ఆక్షేపిస్తున్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో వలంటీర్ల ద్వారా వయోవృద్ధులు, రోగులకు ఇంటి వద్దకే వెళ్లి, పింఛన్లు అందిస్తుండగా.. ఒడిశాలో మాత్రం వృద్ధులను ఈ విధంగా అవస్థలకు గురి చేయడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



ట్రాలీ రిక్షాలో మున్సిపల్ కార్యాయం వద్ద లవంగ గయా

## 'జీవో నంబర్ 117ను రద్దు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: జీఓ నంబర్ 117 ఆధారంగా చేస్తున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. బదిలీలు, ప్రమోషన్లు రీఅపోర్షన్‌మెంట్ జరిగి మూడు నెలలు సమీపిస్తున్నా అధికారుల ఉదాశీనత కారణంగా జీతాలు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పలు ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నేతలు మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను వెంటనే రద్దు చేయాలని, జీఓ 117ను రద్దు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, బదిలీలు రీఅపోర్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద పీఆర్‌టీయూ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ జీఓను తక్షణమే ఉపసంహరించుకుని, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నినదించారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# సద్భావన ప్రతిజ్ఞ



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వేలో జోనల్, డివిజన్ స్థాయిలో సద్భావన దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, అధికారులు.. కులం, ప్రాంతం, మతం లేదా భాషలతో సంబంధం లేకుండా దేశంలోని ప్రజలందరి భావోద్వేగ ఐక్యత, సామరస్యం, విబేధాలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉండాలని సద్భావన దివస్‌లో ఈకో రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మ జోనల్ ప్రధాన కార్యాలయం సిబ్బంది, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల స్థాయిలో ఖుర్దారోడ్ డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా ప్రతిజ్ఞ చేయించారు. మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏటా సద్భావన దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హింసను ఆశ్రయించకుండా అన్ని మతాలు, భాషలు, ప్రాంతాల ప్రజల మధ్య జాతీయ సమైక్యత, మత సామరస్యాన్ని ప్రోత్సహించడం దీని లక్ష్యంగా వివరించారు.

## ఒడిశా మద్యం పట్టివేత

టెక్కలి రూరల్: ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి నుంచి అక్రమంగా తీసుకువస్తున్న 35 టిన్ బీర్లను టెక్కలి పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నందిగాంకి చెందిన టి.దిలీప్, సీహెచ్ శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు ఒడిశా నుంచి మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# వీడిన మర్డర్ మిస్టరీ

- శ్రీకాకుళంలోని వైద్యుని ఇంటిలో హత్య కేసులో పురోగతి
- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందనే యువతి హత్య
- నిందితురాలిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని ఓ వైద్యుని ఇంటిలో జరిగిన హత్య కేసును పోలీసులు ఓ కొలిక్కి తెచ్చారు. తన వివాహేతర సంబంధాలకు అడ్డు వస్తోందని, ఎలాగైనా ఆమెను అడ్డు తొలగించుకోవాలని ఆ ఇంటి పనిమనిషి కొట్టు చిట్టెమ్మ ఈ నెల 14న అర్ధరాత్రి తోటి పనిమనిషి తాళ్లవలస రాజును హత్య చేసినట్లు పోలీసు విచారణలో తేలింది. దీనికి సంబంధించిన విషయాలను టౌన్ సీఐ సన్యాసినాయుడు శుక్రవారం విలేకరులకు వివరాలు వివరించారు. ఆ మేరకు..

విశ్రాంత వైద్యుడు గొల్ల జగన్నాథం గత నాలుగేళ్లుగా విశాఖపట్నంలోనే కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శ్రీకాకుళంలోని పెదపాడు వీరన్నషెడ్ వద్ద ఉన్న ఇల్లు ఖాళీగా ఉంచకూడదని ఎంతో నమ్మకంగా తన వద్ద ఉన్న పనిమనుషులు చిట్టెమ్మ, రాజులను అక్కడే ఉంచి ఇంటి బాగోగులు వారికే అప్పగించారు. వీరిలో చిట్టెమ్మ ప్రవర్తన చాలా అసభ్యకరంగా ఉండేదని, దీంతో రాజు ఆమెను పలుమార్లు మందలించేదని పోలీసులు తెలిపారు. గడిచిన ఆదివారం ఇలిసిపురంలో గల తన బంధువుల ఇంటికి వెళ్లిన రాజు సోమవారం సాయంత్రానికి ఆ ఇంటికి వచ్చింది. అదేరోజు రాత్రి భోజనాలు అనంతరం మరోసారి చిట్టెమ్మతో వివాహేతర సంబంధాలపై ఇద్దరూ గొడవ పడ్డారు. ప్రతి విషయానికి నన్ను బెదిరిస్తావా అంటూ కోపోద్రిక్తమైన చిట్టెమ్మ అక్కడే ఉన్న చెక్క పేడుతో రాజు తలపై బలంగా మోదింది. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. చిట్టెమ్మ తన బట్టలకు అంటిన రక్తం, చెక్కపేడును ఎవ్వరికీ కనిపించకుండా వేరే ప్రదేశంలో పడేసి అదే రోజు పరారైనట్లు సీఐ తెలిపారు. క్లూస్‌టీం పరిశీలన అనంతరం చిట్టెమ్మను నగర శివారు ప్రాంతంలో రూరల్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

# తరగతి బయట పాఠాలు



ఇంటర్న్‌షిప్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ (ఫైల్)

- బీఆర్‌ఏయూ పరిధిలో ఇంటర్న్‌షిప్ ప్రారంభం
- విద్యార్థులకు ఉపయోగపడనున్న ప్రక్రియ

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతున్నాయి. డిగ్రీలో ఆరు సెమిస్టర్లు పరీక్షలు రాయటం, విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే కాకుండా ఇంటర్న్‌షిప్ కూడా అమలు చేస్తున్నారు. గత ఏడాది నుంచే ఈ ప్రక్రియ మొదలైంది. ఐదో సెమిస్టర్‌లో పూర్తిగా ఇంటర్న్‌షిప్ అమలు చేశారు. ఇప్పుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్న నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అమలు చేస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ఇంటర్న్‌షిప్ సెప్టెంబర్ 30వ తేదీ వరకు కొనసాగుతుంది. నాలుగో సెమిస్టర్‌లో 6352 మంది విద్యార్థులు ఉండగా, 33 ప్రభుత్వ శాఖల్లో ఇంటర్న్‌షిప్ కల్పించారు. ప్రభుత్వ శాఖల్లో కేటాయింపులు కలెక్టర్ ఆదేశాల మేరకు చేశారు. మూడేళ్ల డిగ్రీలో 300 రోజులు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్‌లో ఈ ఇంటర్న్‌షిప్ కొనసాగిస్తారు. విద్యార్థుల పరిశీలన, ప్రజెంటేషన్ నివేదిక, విశ్లేషణలు ప్రతిభ ఆధారంగా 300 మార్కులు, 16 క్రెడిట్లకు మార్కులు కేటాయిస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలతో వారు ఆ విభాగంలో నిర్దేశించిన రోజులు పనిచేస్తారు.

**ఆసక్తి, సామర్థ్యాన్ని బట్టి..**

విద్యార్థులు ఆసక్తి, ప్రభుత్వ శాఖలు సామర్థ్యం బట్టి ఇంటర్న్‌షిప్ శాఖలు కేటాయించారు. వ్యవసాయ శాఖలో 285 మంది, విద్యా విభాగంలో 2206, అటవీ శాఖలో 152, వైద్య ఆరోగ్య శాఖలో 556, గ్రామ వార్డు సచివాలయాల్లో 2433, పోలీస్ శాఖలో 172, అగ్ని మాపక శాఖలో 71, మత్స్యశాఖలో 85, పశుసంవర్ధక శాఖలో 7, ఏపీఎస్ఆర్టీసీలో 20, కెమికల్‌లో 11, పౌరసరఫరాల శాఖలో ఒకరు, కలెక్టరేట్‌లో 57, వాణిజ్య పన్నుల శాఖలో 8, దేవదాయ శాఖలో ఒకరు, చేనేత, జౌళిశాఖలో 15, ఉద్యానవన శాఖలో 34, నీటిపారుదల శాఖలో 7, ఐటీడీఏ ఒకరు, గనుల శాఖలో ఒకరు, మున్సిపాలిటీలో 14, పంచాయతీ రాజ్‌లో 4, ఫార్మాలో 42, ఆర్‌అండ్‌బీలో 10, రిజిస్ట్రేషన్ శాఖలో 9, రెవెన్యూ శాఖలో 57, సోషల్ వెల్ఫేర్‌లో 20, ఆదాయ పన్నుల శాఖలో 21, ట్రాఫిక్‌లో 6, ట్రెజరీలో 7, వెలుగులో ఒకరు, మహిళా సంక్షేమ శాఖలో 18, జిల్లా పరిషత్‌లో 20 మందికి కేటాయింపులు చేశారు. ఈ శాఖల్లో సెప్టెంబర్ 30 వరకు పనిచేయాల్సి ఉంటుంది.

### పక్కాగా అమలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలలో పక్కాగా ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల్లో విద్యార్థులకు కేటాయింపులు జరిగాయి. విద్యార్థులకు అలాట్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నాం. గత విద్యా సంవత్సరం ఐదో సెమిస్టర్‌లో విజయవంతంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

### రాష్ట్రంలో ఆదర్శంగా అమలు



గత విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఐదో సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్ అమలు చేశాం. జిల్లా అధికారుల సహకారంతో రాష్ట్రంలో ఆదర్శంగా అమలు జరిగింది. గత కంటే మెరుగ్గా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

## క్లుప్తంగా

### ఎన్నికల వేళ భారీ బందోబస్తు


లక్ష్మీపేటలో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు

**వంగర:** మండలంలోని లక్ష్మీపేట, ఓనెఅగ్రహారం పంచాయతీలలో శనివారం జరగనున్న సర్పంచ్ ఉప ఎన్నికలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఎస్ఐలు ఆర్.జనార్దనరావు, ఇ.శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### యువతి అదృశ్యంపై కేసు

**సంతకవిటి:** యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రేగిడి ఆమదాలవలస మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన 21 సంవత్సరాల యువతి డిగ్రీ చదువు నిమిత్తం సంతకవిటి మండలం బొద్దూరు గ్రామంలో పినతల్లి ఇంటి వద్ద ఉండి రాజాంలోని ఓ కళాశాలలో చదువుకుంటుంది. ఈమె గురువారం కాలేజీకని వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదని పినతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### 20న ఏపీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

**పార్వతీపురం టౌన్:** ఏపీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎండీ గయాజుద్దీన్ తెలిపారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్ – 1, 2 సర్వీసులకు కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రొగ్రాం కోసం రాష్ట్రంలో 11,008 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 20న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులో ఎంచుకున్న కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ హాల్ టిక్కెట్లను ఏపీఎస్‌టీడీసీ.ఏపీసీ ఎఫ్ఎస్ఎస్.ఇన్ పోర్టల్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

### పురుగుల మందు తాగి ఇద్దరి మృతి

**బొబ్బిలి:** మండలంలోని కలువరాయికి చెందిన ఏగిరెడ్డి సోములమ్మ (68) క్రిమి సంహారక మందు తాగి మృతి చెందినట్లు ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఈమె కుమారులు దూరంగా ఉండడంతో ఆవేదనతో ఉండేదని, ఇటీవల కాశీ యాత్రకు వెళ్లి అక్కడ ప్రమాదానికి గురై కాలు విరిగిందని, చికిత్స పొందుతున్న ఈమె ఆవేదనతో ఈ నెల 16న క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో భర్త సన్యాసినాయుడు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి విజయనగరం కేంద్ర ఆస్పత్రి, తరువాత విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ 16న అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**తల్లి మందలించిందని యువకుడు**

గొల్లపల్లికి చెందిన మామిడి సింహాచలం (17) అనే యువకుడు క్రిమి సంహారక మందు తాగి శుక్రవారం మృతి చెందాడని ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ విలేకర్లకు తెలిపారు. తల్లి లక్ష్మి బుద్ధిగా ఉండాలని మందలించడంతో సింహాచలం మనస్తాపం చెంది పురుగుల మందు తాగగా స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### డ్రైవర్ పోస్టులకు ఇంటర్వ్యూ నేడు

**విజయనగరం ఫోర్ట్:** డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల (1962 వాహనం)లో డ్రైవర్ పోస్టులకు శనివారం విజయనగరంలోని వై జంక్షన్ వద్ద ఉన్న పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ సంస్థ మేనేజర్ నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 వతరగతి ఉత్తీర్ణతతో పాటు, హెవీలైసెన్స్ కల్గినవారు అర్హులని చెప్పారు. ఇతర వివరాలకు సెల్:91549 70175 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### అగ్నిమాపక శాఖ డీజీ పర్యటన

**విజయనగరం క్రైమ్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి.సునీల్‌కుమార్ విజయనగరం అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఫైర్ సిబ్బంది నూతనంగా కనిపెట్టిన విక్టిమ్ లొకేటింగ్ కెమెరా పనితీరును డీజీకి వివరించారు. నూతనంగా నిర్మిస్తున్న ఫైర్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. ఆయన వెంట ఆర్ఎఫ్ఓ డి.నిరంజన్‌రెడ్డి, విజయనగరం డీఎఫ్ఓ రామప్రకాష్, ఏడీఎఫ్ఓ వి.సోమేశ్వరరావు ఉన్నారు.

### రెసిడెంట్ అనస్థీసియా పోస్టులకు ఇంటర్వ్యూ రేపు

**విజయనగరం ఫోర్ట్:** ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ అనస్థీసియా పోస్టుల భర్తీకి ఈ నెల 20న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు విజయనగరం.ఎస్ఐసి.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అప్లికేషన్‌తో పాటు విద్యార్హత ఒరిజనల్ ధ్రువపత్రాలతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

# మదిని దోచే మధుర జ్ఞాపకం ఫొటో

- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం
- ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు
- బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ వరకూ ఎన్నో ప్రయాణాలు
- డబ్బా సైజు నుంచి సెల్‌ఫోన్ వరకూ డిజిటల్ ప్రయాణం


కెమెరాలో బంధించిన ఇటువంటి చిత్రాలు అద్భుతం

**ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కళ్ల ముందు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ ఫొటో చూడగానే వెనక్కి వెళ్లి ఏళ్ల క్రితం నాటి మధుర స్మృతులు మదిలో మెదలుతాయి.**

**రాజాం:** సంతోషం.. బాధ.. మధుర ఘట్టాలు.. సాధించిన విజయాలు.. అద్భుత సన్నివేశాలు.. కాలానుగుణంలో ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకుని మళ్లీ మళ్లీ చూసుకునే అవకాశం ఫొటోతోనే సాధ్యం. 18వ శతాబ్దంలో ఫారిన్‌లో పుట్టి ప్రపంచ వ్యాప్తంగా రాజ్యమేలుతున్న ఫొటోగ్రఫికి ఆధునిక కాలంలో మానవ జీవితంతో విడదీయలేని బంధం ఉంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా ప్రత్యేక కథనం.

**ఇదీ చరిత్ర**

ఫొటోగ్రఫీ దినోత్సవం డాగ్యురే అనే శాస్త్రవేత్త ఆవిష్కరణల నుంచి పుట్టింది. ఫ్రాన్స్ దేశానికి చెందిన లూయిస్ డాగ్యురే, జోసఫ్ నైస్‌ఫోర్ నీప్స్ అభివృద్ధి చేసిన ఫొటోగ్రఫీ ప్రక్రియల గురించి 1839, జనవరి 9న ఫ్రాన్స్ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రకటించింది. 1939, ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం ఈ ఆవిష్కరణను ప్రపంచానికి ఉచిత బహుమతిగా ప్రకటించింది. మొట్టమొదటి కలర్ ఫొటోను థామస్ ఘట్టన్ 1861లో తీశారు. తొలి డిజిటల్ ఫొటోను 1957లో తీశారు. 2010, ఆగస్టు 19న ప్రపంచ ఫొటో డే ప్రారంభమైంది.

**డబ్బా సైజు నుంచి..**

ఫొటోగ్రఫీకి ప్రాణమైన కెమెరాలు ఆరంభంలో పెద్ద సైజులో ఉండేవి. డబ్బాలు మాదిరిగా దర్శనమిచ్చేవి. ఆ పరికరాల ధర తక్కువే అయినప్పటికీ కెమెరామెన్ నైపుణ్యంపైనే నాణ్యత ఉండేది. మొదట్లో ఎయిమ్ అండ్ షూట్ కెమెరాలు అందుబాటులో ఉండేవి. ఇవి కొద్దీ దూరంలోని వస్తువులనే కెమెరాలో బంధించగలిగేవి. అనంతరం ఫీల్డ్ కెమెరాలు వచ్చాయి. నల్లగుడ్డతో ముసుగు వేసుకుని ఫొటో తీసే కెమెరాలు అందుబాటులోకి రాగా వీటిలో రెండు ఫిల్ములు మాత్రమే ఉండేవి. ఆ తర్వాతి కాలంలో టీఎల్ఆర్ ఫొటోలు తీసే సామర్థ్యం వచ్చింది. ఇందులో లెన్స్ మార్చుకునే సదుపాయం వచ్చింది. అలా డిజిటల్ కెమెరాల రాకతో ఫొటోగ్రఫీ నిర్వచనమే మారిపోయింది. చిన్నసైజు మెమోరీ కార్డుతో వందలాది ఫొటోలు తీసే సామర్థ్యం, స్పష్టమైన రంగుల్లో అద్భుతమైన ఫొటోలు తీసే నైపుణ్యం అందరికీ అందుబాటులోకి వచ్చింది. వైడ్, టెలీ లెన్స్ రెండింటికీ డిజిటల్ టెక్నాలజీ జోడించి ఫొటోలు నిమిషాల్లో అందజేసే టెక్నాలజీ వచ్చి ఎంతో మందికి పని సులభతరంగా మారింది.

**పాస్‌పోర్ట్ సైజు నుంచి..**

గతంలో చదువులు, ఉద్యోగాలకు దరఖాస్తులు నిమిత్తం పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అవసరముండేది. నల్లని ముసుగుతో సూర్యకిరణాలు ఆధారంగా ఫొటోలు తీసేవారు. ఈ ఫొటోలు బ్లాక్ అండ్ వైట్‌లో వచ్చేవి. ఇప్పుడు అలా కాకుండా డిజిటల్ విధానం అందుబాటులోకి రావడంతో ఫొటోలు తీయడం సులభంగా మారింది. ఫ్లెక్సీలు రూపంలో వీధుల్లో దర్శనమిస్తున్నాయి. ఇంట్లో గోడలకు ఫ్రేమ్‌లుగా మారి అందంగా కనిపిస్తున్నాయి. పెళ్లిళ్లు, ఫంక్షన్లల్లో స్వాగత ద్వారాలు వద్ద ఫొటో ఫ్రేమ్‌లు ఫ్లెక్సీలుగా మారి దర్శనమిస్తున్నాయి. ఫొటోగ్రాఫర్‌కు కంప్యూటర్ పరిజ్ఞానం కలసిరావడంతో ఫొటోగ్రఫీ జైత్రయాత్ర కొనసాగుతుంది.

**స్త్రీ.. పురుషులిద్దరూ..**

ఫొటోగ్రఫీ అనగానే గతంలో కేవలం పురుషులు మాత్రమే కనిపించేవారు. ఇప్పుడు ఫొటోగ్రఫీకి విపరీతమైన క్రేజ్ ఉండడంతో పాటు అనేక అవకాశాలు వచ్చాయి. ఫలితంగా స్త్రీలు కూడా ఈ ఫొటోగ్రఫీలో తమ సత్తా చాటుతున్నారు. డిజిటల్ కెమెరాలు అందుబాటులో ఉండడం, కొత్త ఫీచర్లతో సెల్‌ఫోన్‌లు రావడంతో ఫొటోగ్రఫీ ఈజీ అయ్యింది. కొంతమంది తాము తీసిన ఫొటోలను సెల్‌ఫోన్‌ల్లో వినూత్నంగా మార్చి యూ ట్యూబ్, ఫేస్ బుక్, ఇన్‌స్ట్రాగామ్‌లలో షేర్‌చేస్తూ తమ నైపుణ్యతను చాటుకుంటున్నా రు. వెబ్ ఆధారిత సేవలు అందుబాటులోకి రావడంతో యానిమేషన్, జియో స్పేషియల్, పాత్రికేయం, ప్రచారం, మల్టీమీడియా, ఫ్యాషన్ రంగాల్లో ఫొటోగ్రఫీకి ఎనలేని డిమాండ్ నెలకొంది. కేవలం ఫొటోగ్రఫీనే వృత్తిగా ఎంచుకునే వారు కొందరైతే తమ సృజనాత్మకతను చాటుకునేందుకు ఫొటోగ్రఫీపై మక్కువ చూపేవారు మరికొందరున్నారు.

**నమ్మిన వారికి జీవితం**

ఫొటోగ్రఫీ నమ్మినవారికి జీవితాన్ని ఇస్తుంది. ఏ రకమైన ఆధారం లేని సమయంలో ఈ ఫొటోగ్రఫీ వైపు దృష్టి సారించాను. ఎప్పుడో 23 ఏళ్ల క్రితం ఈ వృత్తిలోకి వచ్చిన నేను బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ ఫొటోల వరకూ డిజిటల్ రంగాన్ని చూశాను. ఇప్పుడు కూడా ఈ ఫొటోగ్రఫీకి ఎంతో డిమాండ్ ఉంది. – తేగల మోహన్, మోహన్ డిజిటల్ ఫొటో స్టూడియో, రాజాం

**మంచి వృత్తి..**

ఫొటోగ్రఫీ చాలా మంచి వృత్తి. సమాజంలో చాలా గౌరవం ఉంటుంది. నిజాయితీతో కూడిన ఫొటోగ్రఫీ వృత్తి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచి పెడుతుంది. ఈ వృత్తిలో రాణించిన వారికి, ప్రొఫెషనల్‌గా మంచి ఫొటోలు తీసిన వారికి ఎంతో పేరుప్రఖ్యాతలు ఉంటాయి.
– బండారు అనంతరావు, ఫొటోగ్రాఫర్, రాజాం

# ఓటర్ల సర్వే 90 శాతం పూర్తి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, మయూర్‌అశోక్

- కలెక్టర్ నాగలక్ష్మి

**విజయనగరం అర్బన్:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియ 90 శాతం పూర్తయినట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటర్ల జాబితా సవరణపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను డూప్లికేట్ ఓటర్లు, మరణించిన, బదిలీ అయిన వారి ఓటర్ల వివరాలను నమోదుచేసినట్టు రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. సమావేశంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీఓలు సూర్యకళ, అప్పారావు, శేషశైలజ, ఎస్‌డీసీలు వెంకటేశ్వరరావు, సుదర్శనదొర, సూకరాజు, పద్మలత పాల్గొన్నారు.

# శ్రావణ శోభ


సంతోషిమాత ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

శ్రావణమాసంలోని తొలి శుక్రవారం జిల్లాలోని ఆధ్యాత్మిక క్షేత్రాలన్నీ భక్తసంద్రంగా మారాయి. వేకువజాము నుంచే ఇష్టదైవాలకు భక్తులు పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ప్రత్యేక అలంకరణలో విజయనగరం పైడితల్లి అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో విజయనగరంలోని సంతోషిమాత అమ్మవారు


పసుపు కొమ్ముల అలంకరణలో చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారు


నెల్లిమర్ల రూరల్: గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న రామతీర్థం రామస్వామి ఆలయంలోని మహాలక్ష్మి అమ్మవారు


పూజలు చేస్తున్న భక్తులు


వనంగుడి పైడితల్లి అమ్మవారికి వసంత గోష్టి నిర్వాహకుల చీరల అలంకరణ


బంగారు, వజ్రకిరీటధారణతో శాకంబరీ దేవిగా కన్యకపరమేశ్వరి అమ్మవారు

# ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు


రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

**విజయనగరం:** రాష్ట్ర స్థాయిలో జరిగిన జూనియర్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 12, 13 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఎం.ధనుష్ సాయి, వై.అఖిల్ బ్రాంజ్ మెడల్స్ సాధించటంతో పాటు వచ్చే నెలలో గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. టీమ్ ఈవెంట్‌లో ఆర్.లిఖితకుమార్, వై.అకిల్, కె.కిరణ్, జి.అభిషేక్, పి. గ్రీష్మ, ప్రవళ్లిక, కె.యశోద, ఎం.ధనుష్య సాయి బ్రాంజ్ మెడల్స్ దక్కించుకున్న వారిలో ఉన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య శిక్షకులు డి.వి.చారి ప్రసాద్ అభినందించారు.

# ఆర్టీఓగా ఎంపికైన మనోహర్‌కు అభినందనలు


గోపిశెట్టి మనోహర్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు గోపిశెట్టి నాగేశ్వరరావు, మంజుల

**విజయనగరం:** పట్టుదలతో ఏదైనా సాధించగలం అని నిరూపించారు సాలూరు పట్టణానికి చెందిన గోపిశెట్టి మనోహర్. గురువారం విడుదలైన గ్రూప్ 1 ఫలితాల్లో మనోహర్ ఆర్టీఓగా ఎంపికయ్యారు. ప్రాథమిక విద్య కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు బొబ్బిలి శ్వేతాచలపతి స్కూల్లో, ఇంటర్ హైదరాబాద్ శ్రీ చైతన్య సివిల్స్ అకాడమీలో, డిగ్రీ ఢిల్లీ జవహర్ లాల్ యూనివర్శిటీలో పూర్తి చేశారు. ఆర్యవైశ్య రాష్ట్ర కార్యదర్శి ఆలవెల్లి శేఖర్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి కుమార్, శ్రీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయం కార్యదర్శి పెంటపాటి కామరాజు, అవోపా జిల్లా అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, మండవిల్లి వెంకటరాజు, డిమ్స్ రాజు తదితరులు మనోహర్‌ను అభినందించారు.

# వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

**విజయనగరం ఫోర్ట్:** సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైనా వ్యాధులు వ్యాప్తి చెందినట్లు అయితే సంబంధిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వ్యాధుల వ్యాప్తి చెందిన గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎక్కడ కూడా అపారిశుధ్యం లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని చెప్పారు. బీపీ, షుగర్ వంటి వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీలను అందరికి క్రియేట్ చేయాలని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అందరు పాల్గొని రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఏఎన్ఎంలకు ఇచ్చిన యాప్‌లో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో డీఐఓ అచ్చుతకుమారి, డీఎల్ డాక్టర్ సూర్యనారాయణ, డీఎంఓ వై.మణి తదితరులు పాల్గొన్నారు.

# మన్యంలో పులి

- అటవీ ప్రాంతం వీడి జనావాసాలకు దగ్గరగా...
- ధ్రువీకరించిన అటవీ శాఖ అధికారులు


పులి సంచారిత ప్రాంతాల్లో సిబ్బందికి సూచనలు చేస్తున్న అటవీ రేంజ్ అధికారి

**పాలకొండ రూరల్/సీతంపేట/భామిని:** ఏనుగుల సంచారంతో కొన్నేళ్లుగా భయాందోళనల మధ్య బతుకుతున్న మన్యం ప్రజలకు తాజాగా పులి సంచారం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మూడు రోజుల కిందట వీరఘట్టం మండలం కడకెల్ల వద్ద, భామిని మండల పరిసరాల్లో పులి పాద ముద్రలు గుర్తించిన ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చారు. వీటిని పరిశీలించిన అటవీ అధికారులు అవి పెద్ద పులివిగా నిర్ధారణకు రావడంతో మన్యం ప్రజల్లో ఆందోళన మొదలైంది. తాజాగా సీతంపేట మండలంలో కూడా పులి సంచారం ఉన్నట్టు అధికారులు స్పష్టం చేయడంతో ఆందోళన ఎక్కువైంది. పులి కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అటవీ రేంజ్ అధికారి ఎస్.తవిటినాయుడు ప్రజలకు సూచించారు. ప్రజా రక్షణకు అవసరమైన చర్యలపై దృష్టి పెట్టామన్నారు. పులి సంచారిత ప్రాంతాలతో పాటు నియోజకవర్గంలో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తున్నామన్నారు. పులి జాడలు, కదలికలు తారసపడితే తక్షణమే 9493735395, 9441798818, 7396689244, 8008178219, 9492822064 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

# రోడ్డెక్కిన విద్యార్థులు

- డీఎస్పీ హామీతో శాంతించిన విద్యార్థులు


అంబేడ్కర్ జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

**రాజాం సిటీ:** తమ స్నేహితుడి మృతికి కారణమైన లారీని తక్షణమే పట్టుకోవాలని విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. శ్రీకాకుళం రోడ్డులోని ఎస్సీ వసతిగృహంలో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న బేరి రవితేజ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఉదయం 11 గంటల సమయంలో స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో పాటు మృతుని బంధువులు అంబేడ్కర్ జంక్షన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. తమ స్నేహితునికి న్యాయం చేయాలని, మృతికి కారణమైన లారీతో పాటు డ్రైవర్‌ను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ నినాదాలు చేశారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. మధ్యాహ్నం సీఐ కె.రవికుమార్ జోక్యం చేసుకుని విద్యార్థులతో సంప్రదింపులు చేపట్టారు. రవితేజ మృతికి లారీ కారణంగా సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించామని, అయితే నెంబర్ సరిగా కనిపించడం లేదని, అయినప్పటికీ దర్యాప్తు చేపడుతున్నామని వారికి హామీ ఇవ్వడంతో కొద్దిసేపు ఆందోళన విరమించారు. కళాశాలలు విడిచిపెట్టిన సమయంలో మళ్లీ సాయంత్రం విద్యార్థులంతా ఆందోళనకు దిగారు. దీంతో నాలుగు రోడ్ల కూడలిలో కిలోమీటరు వాహనాలు నిలిచిపోయాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

**డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ**

విషయం తెలుసుకున్న చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులతో సంప్రదింపులు జరిపారు. వాహనాన్ని పట్టుకునే పనిలోనే ఉన్నామని చెప్పినప్పటికీ తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థులు డీఎస్పీ ఎదుట పట్టుబట్టారు. 24 గంటల్లో వాహనాన్ని పట్టుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దర్యాప్తు కొనసాగుతుందని, దీని కోసం మూడు బృందాలను ఏర్పాటు చేశామని విద్యార్థులకు తెలియజేశారు. డీఎస్పీ హామీతో విద్యార్థులంతా ఆందోళన విరమించారు. నలువైపులా నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సుమారు గంట సమయం పట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజాం, చీపురుపల్లి సీఐలు రవికుమార్, సంజీవరావులతోపాటు ఎస్ఐలు, సిబ్బంది చర్యలు చేపట్టారు.